క్లుప్తంగా

ఘనంగా గ్రామోత్సవం

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో చిల్లకూరు గ్రామదేవత దేశమ్మకు గురువారం ఉదయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాక్టర్‌పై అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం

చిల్లకూరు: మండలంలోని నెలబల్లిరెట్టపల్లెలో రూ.10 లక్షల వ్యయంతో తాగునీటి పైపులైన్ పనులు, పారిశుద్ధ్యం మెరుగు తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని తీర్మానం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో నెలబల్లిరెట్టపల్లె పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం సచివాలయంలో సర్పంచ్ పారిచెర్ల కోటమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ అన్నంరెడ్డి రమేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, శ్యామల పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ సెలక్షన్లు



విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం ఫైనలియర్ బీటెక్ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ ల్యూమెన్ టెక్నాలజీస్ క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించింది. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి అందులో ఎంపికైన వారికి టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించి, మొత్తం ఏడుగురు విద్యార్థులను రూ.7.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

గూడూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు గూడూరులోని ఐటీ కళాశాలలోని స్కిల్‌హబ్ ద్వారా ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పదో తరగతి, ట్రైనీ బ్యూటీషియన్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్‌కు 8వ తరగతి అర్హత ఉండాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్లు తమ పరిధిలోని కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్సు పర్సన్‌లు, వార్డు వలంటీర్ల ద్వారా శిక్షణకు అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులను గుర్తించి ఈనెల 25వ తేదీ లోగా స్కిల్ హబ్‌కు పంపాలని కోరారు. వివరాలకు 86398 08782, 99665 08259, 77993 00659 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న నేతలు

కోట: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోటలోని బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నరమాల వెంకటరమణయ్య చేతుల మీదుగా పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, విద్యార్థి విభాగం కార్యదర్శి వాసు, హెచ్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదవాలి

సైదాపురం: విద్యార్థులు ఇష్టపడి చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత చదువులు చదువుకోవాలని మహిళా శక్తి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు విజయమ్మ కోరారు. మండలంలోని చాగణం, ఊటుకూరు ఉన్నత పాఠశాలలో గురువారం మహిళాశక్తి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. మార్పు సంస్థ ఫౌండేషన్ అధ్యక్షుడు చిగురుపాటి పవన్, మహిళా శక్తి ప్రతినిధులు లక్ష్మి, లక్ష్మీప్రసన్న ,సౌజన్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తే ఉపేక్షించం

వెంకటగిరిరూరల్: మండలంలో మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తే ఎంతటివారినైనా సరే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్, పోలీస్, సెబ్, అగ్రికల్చర్, ఉపాధి హామీ పథకం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మావతి మాట్లాడుతూ చెరువులు, గొడ్డేవాగు, కైవల్యానదిలో, గుంతల్లో మట్టిని అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. అక్రమ రవాణా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మట్టి, గ్రావెల్ తరలించేవారు అధికారుల వద్ద ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరీముల్లా, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాపూరు: మాట్లాడుతున్న సీడీపీఓ సునంద, ఉమామహేశ్వరి

వెంకటగిరి: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం విధిగా తీసుకుంటే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం, మందరిళ్ల అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఎక్కువశాతం ప్రోటీన్లు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఎక్కువ శాతం చిరుధాన్యాలు, ఆకుకూరలు, గుడ్లు, పాలు అధికంగా తీసుకోవాలన్నారు. బంగారుపేట పీహెచ్‌సీ వైద్యురాలు పల్లవి మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మెప్మా సిబ్బంది వెంకట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, పరిమల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం పదిలం

గూడూరు: చిరు ధాన్యాలతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ ఎస్‌కే మహబూబీ అన్నారు. చవటపాళెం–3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ చిరు ధాన్యాల్లో అనేక పోషకాలుంటాయని, శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం గ్రామంలో పోషణ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూపారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, యశోద, వాణి, ఏఎన్‌ఎం స్వరూప పాల్గొన్నారు.

చిట్టేడులో ఘనంగా పోషణ పక్వాడా

కోట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ఏఎన్‌ఎం శ్యామల, ఆశా వర్కర్ స్వాతి పాల్గొన్నారు.



కోట: అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ కవిత

పోషక ఆహారాన్ని అందించాలి

రాపూరు: గర్భిణులు, చిన్నారులకు పోషక పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునంద, అసిస్టెంట్ సీడీపీఓ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. రాపూరు మండలం సైదాదుపల్లెలో గురువారం పౌష్టికాహారోత్సవాల్లో భాగంగా తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు అధికంగా తీసుకుంటే ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారని చెప్పారు. సూపర్‌వైజర్ ధనమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, రమ, విజయ, సుజాత పాల్గొన్నారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం

సైదాపురం: పౌష్టిహారంతోనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని సైదాపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య అన్నారు. సైదాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నట్లు తెలిపారు.



సైదాపురం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



గూడూరు: మాట్లాడుతున్న సీడీపీఓ మహబూబీ



వెంకటగిరి: మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్‌బేగం

వెంకటగిరి అభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్సీల అభినందన కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: నియోజకవర్గం అభివృద్ధికి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్‌తో కలిసి సమష్టిగా కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో నేదురుమల్లి ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. తొలుత నేదురుమల్లి బంగ్లా నుంచి మోటారుసైకిల్ ర్యాలీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీలను పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ప్రభుత్వంపై వ్యతిరేక భావనలో ఉన్నారని టీడీపీ దుష్ప్రచారం చేస్తుందని, అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి విజయంతో వారు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారన్న విషయం రుజువు అయ్యిందన్నారు. మేరిగ మురళీధర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం, ఆయన నియోజకవర్గంలోని రాపూరు వాసి కావడం నియోజకవర్గం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ నిజాయితీ, పనిచేసేతత్వం కలిగిన నేదురుమల్లి నాయకత్వంలో వెంకటగిరి అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన పేరును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సూచించిన తొలి వ్యక్తి నేదురుమల్లి అని కొనియాడారు.



పోలేరమ్మను దర్శనానికి వస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీలు మురళీధర్, చంద్రశేఖర్‌రెడ్డి

పోలేరమ్మసేవలో ఎమ్మెల్సీలు, నేదురుమల్లి

వైఎస్సార్‌సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగమురళీధర్, పి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం పోలేరమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఏ శ్రీనివాసులురెడ్డి వారిని ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. పార్టీ సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, నేదురుమల్లి విక్రమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి పులిప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉమామహేశ్వరి,ఎస్ బాలయ్య, ధనియాల రాధమ్మ, చిట్టేటి హరికృష్ణ, డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, దేవికా చౌదరి, కౌన్సిలర్లు, సొసైటీ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, టి గణేష్‌రెడ్డి, నాగరాజు, పేచీరాజ్ పాల్గొన్నారు.

అమ్మా సరస్వతీ.. చల్లంగా దీవించవమ్మా!



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

సైదాపురం: అమ్మా సరస్వతీ..మమ్ము చల్లంగా దీవించవమ్మా అంటూ పదో తరగతి విద్యార్థులు సరస్వతీ దేవికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవీకి విశేషాలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చలపతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి, త్వరలో జరగబోయే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని కోరారు. ప్రతి విద్యార్థీ భయపడకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. అనంతరం అన్నదానంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాలపై పరిశీలన



హోలీక్రాస్ జంక్షన్‌లో రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, అధికారులు

సూళ్లూరుపేట: పట్టణంలోని హోలీక్రాస్ సెంటర్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, ఎస్‌ఐ పూరి రవిబాబు తదితరులు గురువారం పరిశీలించారు. హోలీక్రాస్ సర్కిల్‌లో ఏ వాహనం ఎలా వెళుతుందో అర్థం కాక పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని శ్రీమంత్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో శ్రీసిటీ సెజ్‌లో ఉన్న కంపెనీలకు చెందిన బస్సులు విపరీతంగా పెరిగిపోవడంతో ఉదయం, సాయంత్రం, హోలీక్రాస్ జంక్షన్‌లో ట్రాఫిక్ పెరిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ మీజూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న ధార్మిక సేవా సంస్థ సభ్యులు

కోట: మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన పేద బ్రాహ్మణ కుటుంబానికి గురువారం శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. కొత్తపాళేనికి చెందిన కోన సాయిబాబా అర్చకత్వంతో జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబానికి శ్రీసీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణరావు, నాగరాజు రూ.14 వేలు నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దీవి అనంతాచార్యులు, నరేష్‌శర్మ, సుశాంతి, రాజ పాల్గొన్నారు.

పాత్రికేయుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న పాత్రికేయులు

నాయుడుపేటటౌన్: పత్రిక స్వేచ్ఛను కాపాడాలని, పత్రికారంగ అస్తిత్వాన్ని పరిరక్షించాలని, పాత్రికేయుల వేతన భద్రతలు, హక్కులను రక్షించాలని, పాత్రికేయులపై దాడులను అరికట్టాలని కోరుతూ గురువారం పాత్రికేయులు ర్యాలీ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు



గాయపడిన వినయ్

చిల్లకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థికి గాయాలైన సంఘటన కడివేడు సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు కథనం మేరకు.. సర్వేపల్లికు చెందిన వినయ్ అనే విద్యార్థి కోట మండలం ఎన్‌బీకేఆర్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతను బైక్‌పై కళాశాలకు వచ్చి తరగతులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా కడివేడు సమీపంలోని మద్యం దుకాణం నుంచి వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో వినయ్ గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న అటవీ అధికారి మురళి 108కి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

గూడూరురూరల్: ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గూడూరు పట్టణంలో ఆధార్ అనుసంధానం ప్రక్రియ తక్కువ శాతం ఉందన్నారు. ఈ ప్రక్రియను వేగవంతంగా చేయని పలువురు బీఎల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడూరు నియోజకవర్గంలో 85 శాతం మాత్రమే పూర్తి అయ్యిందని, ఇంకా 15 శాతం పూర్తి కావాల్సి ఉందన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానంతో బోగస్ ఓటర్లు తొలగించవచ్చని, నిజమైన ఓటరు మాత్రమే ఉంటారని తెలిపారు. త్వరలో అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించి, తొలగింపు ఓటర్లపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, తహసీల్దార్ బి.లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నపత్రాలు

గూడూరురూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలను గురువారం విద్యాశాఖ అధికారులు గూడూరులోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికలు, సీఎస్‌ఎం, జీఎస్‌ఆర్‌ఎం, సెయింట్ మేరీస్, చెన్నూరు జెడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు ప్రతిరోజు పోలీసు స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లతామని రూట్ ఆఫీసర్, గూడూరు ఎంఈఓ దేవరాజులరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రూట్ ఆఫీసర్ ఎంవీ సునీల్‌కుమార్, ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గూడూరురూరల్: తిరుపతి జిల్లాలో ఉన్న అరబిందో ఎమర్జెన్సీ 108 అంబులెన్స్ సర్వీస్‌లో డ్రైవర్లు, ఈఎంటీ ఉద్యోగాల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు డీఎం పవన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెళ్లకూరు, తిరుపతి, బీఎన్ కండ్రిగ, కేవీబీ పురం, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, వరదయ్యపాళెం, గూడూరు, తడ, సూళ్లూరుపేట, వెంకటగిరి, చిట్టమూరు మండలాల్లో అర్హులైన అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. డ్రైవర్ పోస్టులకు హెవీ లేదా బ్యాడ్జితో మూడేళ్ల అనుభవం కలిగి పదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ఈఎంటీ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ అర్హతలు కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో బయోడేటాను ఈనెల 25వ తేదీలోగా 108 ఆఫీస్, మధురానగర్, మున్సిపల్ పార్కు, సౌత్‌రోడ్, తిరుపతి నందు నేరుగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 9505551475 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడి ఇద్దరు తీవ్ర గాయపడిన సంఘటన వెంకటగిరి– గూడూరు మార్గంలోని మన్నూరురోడ్డు మలుపు వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి రూరల్ మండలం యాతలూరు గ్రామానికి చెందిన గంటా లక్ష్మమ్మ, పి తులసీలక్ష్మి, చలపతి మరోవ్యక్తితోపాటు ఆటోలో నెల్లూరు నుంచి స్వగ్రామమైన యాతలూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో బాలాయపల్లి మండలం మన్నూరు రోడ్డు మలుపు వద్దకు వచ్చేసరికి ఆటోకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి, అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ఉన్న లక్ష్మీతులసి, లక్ష్మమ్మకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది రవి, పెంచలయ్య సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మేనకూరుకు చరిత్ర పుటల్లో స్థానం



మాట్లాడుతున్న కట్టా సుధాకర్ రెడ్డి

నాయుడుపేట: దివంగత నేత వైఎస్సార్ దేశ చరిత్రలో పుటల్లో మేనకూరుకు పారిశ్రామిక కేంద్రంగా స్థానం కల్పించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేనకూరులో చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్ద పలు మండలాలకు చెందిన పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. సర్పంచ్ సీహెచ్ సురేష్ అధ్యక్షతన జరిగి శిక్షణ తరగతులను జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతిరెడ్డి, ఎంపీపీ కురుగుండ్ల ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా గూడూరు డివిజన్ పరిధిలో చెత్తతో సంపద తయారీ కేంద్రం నిర్వహణలో మేనకూరు పంచాయతీ ఆదర్శ పంచాయతీగా పేరు గడించిందన్నారు. ఎంపీడీఓలు శివప్రసాద్, వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు గోపాల్, గోవిందయ్య, భారతి, డీఎల్‌పీఓ వెంకటరమణ, రీసోర్స్ పర్సన్లు వెంకట్రావ్, వెంకట్రాది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు ఎస్వీబీసీ చైర్మన్ సత్కారం



ఎమ్మెల్సీలను సత్కరిస్తున్న సాయికృష్ణయాచేంద్ర

వెంకటగిరి: స్థానిక రాజాప్యాలెస్‌లో ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలను గురువారం సత్కరించారు.

మహిళకు తీవ్ర గాయాలు

వెంకటగిరిరూరల్: మోటారుసైకిల్ అదుపుతప్పి పడి మహిళా తీవ్ర గాయాల పాలైంది. ఈ ఘటన వెంకటగిరి– గూడూరు మార్గంలోని బంగారుపేట తెలుగుగంగ కాలువ వంతెన వద్ద గురువారం చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు.. వెంకటగిరి పట్టణం బొగ్గులమిట్టకు చెందిన బాలు, గుంజి భారతి దంపతులు తమ ద్విచక్ర వాహనంపై గూడూరుకు బయలుదేరారు. తెలుగుగంగ కాలువ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు ఆపి, ఒక్కసారిగా కారు డోర్ తీయడంతో మోటారు సైకిల్‌కు తగిలి అదుపు తప్పి బోల్తా పడ్డారు. ఈ ఘటనలో అందులో ఉన్న బాలు సతీమణి భారతి గాయపడి, అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆర్ఎస్ మొబైల్స్‌లో వీఓ వీ27 5జీ విడుదల



వీఓ వీ27 మొబైల్‌ను విడుదల చేస్తున్న ఆ సంస్థ సిటీ మేనేజర్, డిస్ట్రిబ్యూటర్, తదితరులు

గూడూరురూరల్ : ప్రముఖ స్మార్ట్ ఫోన్ కంపెనీ వీఓ తన నూతన మోడల్ వీఓ వీ27 సిరీస్ 5 జీ మొబైల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు గూడూరు పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఆర్ఎస్ మొబైల్స్‌లో ఈ ఫోన్‌ను ఆవిష్కరించారు. వీఓ కంపెనీ ఎప్పటికప్పుడు వినియోగదారుల అభిరుచి మేరకు తమ ఉత్పత్తులను విడుదల చేస్తుందని ఆ సంస్థ సిటీ మేనేజర్ శివ తెలిపారు. ఇందులో 5జీ టెక్నాలజీతోపాటు అనేక రకాల అధునాతన సాంకేతిక సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ మొబైల్స్ అధినేత మంజుల రాధాకృష్ణ, జానా రమేష్, శ్రీలక్ష్మీ కమ్యూనికేషన్స్ డిస్ట్రిబ్యూటర్ సునీల్, ఏఎస్‌ఎం త్రిలోక్, రిటైల్ మేనేజర్ ఫణి, మేనేజర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతే సీఎం జగనన్న లక్ష్యం

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి మహిళ సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని మహిళలందరూ ఆయనకు తోడుగా నిలవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన వైఎస్సార్ ఆసరా, సున్న వడ్డీ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌన్సిలర్ దారా రవి, ఎస్‌డీ అఫ్రీన్ పాల్గొన్నారు.

మందులు పంపిణీ

దొరవారిసత్రం: మండలంలోని కారికాడు, కల్లూరు గ్రామాల్లో గురువారం తొగరాముడి పీహెచ్‌సీ వైద్యులు వైద్యశిబిరం ఏర్పాటు చేసి, రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ, కుష్టు తదితర జబ్బులపై ప్రత్యేక శ్రద్ధ చూపి నెలకు సరిపడ మందులను అందజేశారు. డాక్టర్ తరుణ్ పాల్గొన్నారు.

ఉపవాసాలు ప్రారంభం

నాయుడుపేటటౌన్: ముస్లింలు గురువారం రాత్రి తరాబీ నమాజు చేసి, భక్తి శ్రద్ధలతో ఉపవాస వేడుకలు ప్రారంభించినట్లు జామీయ మసీదు మతపెద్దలు ప్రకటించారు. మసీదుల వద్ద ఇఫ్తార్ విందులతో పాటు నమాజులు నిర్వహిస్తున్నట్లు ఆయా మసీదుల మతపెద్దలు, ముతవల్లీలు తెలిపారు.

గ్రావెల్ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో గ్రావెల్ తరలింపును గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ కృష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు.